# వయనాడ్‌లో విలయం



మహిళను రక్షించిన ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

వయనాడ్, జూలై 30: కేరళలో ఘోర ప్రకృతి విపత్తు సంభవించింది. వయనాడ్ జిల్లాలోని మెప్పడి, చూరల్‌మల గ్రామాలతో పాటు ముండక్కై పట్టణంపై కొండచరియలు విరుచుకుపడ్డాయి. మంగళవారం తెల్లవారు జామున 2 గంటల నుంచి 6 గంటల మధ్య మూడు సార్లు కొండచరియలు తెగిపడ్డాయి. దీంతో వందలాది ఇండ్లు, దుకాణాలు నేలమట్టమయ్యాయి. 133 మంది మరణించినట్టు అధికారులు గుర్తించారు. 128 మంది తీవ్రంగా గాయపడి దవాఖానల్లో చికిత్స పొందుతున్నారు. ఇప్పటివరకు 481 మందిని రక్షించారు. అయితే, వందలాది మంది ఆచూకీ తెలియడం లేదు. చాలా ఇండ్లు వరద, బురదలో మునిగిపోయాయి. వీటిల్లో చిక్కుకున్న ప్రజలు తమను కాపాడమని హాహాకారాలు చేస్తున్నారు. పదుల సంఖ్యలో మృతదేహాలు, మనుషుల శరీర అవయవాలు చలియార్ నదిలో కొట్టుకుపోతున్నాయి. ఇక్కడి తోటల్లో పని చేసేందుకు అస్సాం, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన దాదాపు 600 మంది ఆచూకీ తెలియడం లేదు. ప్రాణనష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ప్రకృతి అందాలకు చిరునామాగా ఉండే ఈ ప్రాంతమంతా ఇప్పుడు విపత్తు సృష్టించిన విలయంతో హృదయవిదారకంగా మారింది.

**నాలుగు గంటల వ్యవధిలో మూడుసార్లు**

సోమవారం నుంచి వయనాడ్ ప్రాంతంలో తీవ్ర వర్షాలు కురుస్తున్నాయి. దీంతో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల నుంచి 6 గంటల మధ్య మెప్పడి, చూరల్‌మల గ్రామాలతో పాటు ముండక్కై పట్టణంలో కొండచరియలు మీద పడ్డాయి. ముండక్కై పట్టణంలోని రెండు వార్డుల్లో వందలాది ఇండ్లు నేలమట్టమయ్యాయి. చూరల్‌మల గ్రామంలో చాలా భాగం పూర్తిగా కొట్టుకుపోయింది. ముండక్కై, చూరమల, అట్టమల, నూల్‌పుజ తీవ్రంగా దెబ్బతిన్నాయి.

**ఉప్పెనలా ముంచుకొచ్చిన వరద**

కొండచరియలు విరిగిపడటం వల్ల జరిగిన నష్టానికి తోడు వరద కూడా మరింత విలయాన్ని మిగిల్చింది. కొండల మీదుగా విరిగి పడ్డ శిథిలాలు నీటి ప్రవాహంలో పడటం, భారీ వర్షాల కారణంగా ఎగువ కొండల నుంచి వరద ఒక్కసారిగా పోటెత్తడంతో చాలా ఇండ్లు, దుకాణాలు, వాహనాలు వరదలో కొట్టుకుపోయాయి. వందలాది ఇండ్లు బురదలో మునిగిపోయాయి. వీటిల్లో చిక్కుకుపోయిన వారు బయట ఉన్న వారికి ఫోన్లు చేసి కాపాడాలని విలపిస్తూ వేడుకుంటున్నారు.

**కూలిన వంతెనలు.. రోప్‌లే దిక్కు**

కొండచరియలు పడటం, వరద వల్ల చూరల్‌మల బ్రిడ్జి, ముండక్కై బ్రిడ్జి కూలిపోయాయి. ముండక్కైకి వెళ్లే రహదారిపై కూడా భారీగా కొండచరియలు పడిపోయాయి. దీంతో ఈ ప్రాంతాలకు చేరుకునేందుకు రోడ్డుమార్గం పూర్తిగా తెగిపోయింది. చివరకు రోప్‌లు వేసుకొని సహాయక సిబ్బంది ప్రభావిత ప్రాంతాలకు చేరుకున్నారు.

**ముందుజాగ్రత్తతో దక్కిన పలువురి ప్రాణాలు**


2020లోనూ ముండక్కైలో తక్కువ తీవ్రతతో కొండచరియలు విరిగిపడ్డాయి. సోమవారం నుంచి భారీ వర్షాలు కురుస్తుండటంతో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని స్థానిక అధికార యంత్రాంగం ప్రజలను అప్రమత్తం చేసింది. దీంతో దాదాపు 200 మంది ఇండ్లను వదిలి ముండక్కైలోని ఓ రిసార్ట్, మద్రస్సాలో తలదాచుకొని ప్రాణాలు దక్కించుకున్నారు.



- దేవభూమి కేరళలో ఊహకందని విపత్తు
- బీభత్సం సృష్టించిన కొండచరియలు
- 133 మంది మృతి.. 128 మందికి గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వందల మంది
- జాడలేని 600 మంది వలస కూలీలు!
- చలియార్ నదిలో తేలుతున్న మృతదేహాలు
- రక్షించాలంటూ ఆత్మీయులకు శిథిలాల కింద చిక్కుకున్న బాధితుల ఫోన్లు
- రంగంలోకి ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్
- భారీ వర్షాలతో సహాయ చర్యలకు ఆటంకం
- వయనాడ్, సరిహద్దు జిల్లాలకు రెడ్ అలర్ట్
- 48 గంటల్లో 572 మి.మీ.వర్షపాతం నమోదు



చూరల్‌మలలో కొండ చరియలు విరిగి పడ్డాక నెలకొన్న బీభత్సం



వయనాడ్ జిల్లాలో కొండ చరియలు విరిగిన చోట ప్రొక్లెయిన్లతో కొనసాగుతున్న సహాయక చర్యలు

**హెచ్చరికలను పట్టించుకోక..**

అధికారులు అప్రమత్తం చేసినా కొందరు ఇండ్లు వీడకుండా ప్రమాదాన్ని కొనితెచ్చుకున్నారు. శ్లాబ్‌తో ఇండ్లు ఉన్న వారు సురక్షిత ప్రాంతాలకు రాలేదని, ఆ ఇండ్లన్నీ ఇప్పుడు కూలిపోయాయని మెప్పడి పంచాయతీ ప్రసిడెంట్ కే బాబు చెప్పారు. '11 గంటలకు మేము ఇంటి నుంచి బయటకు వచ్చేసినప్పుడు మా పక్కింటి వ్యక్తినీ రమ్మనిచెప్పినా రాలేదు. ఇప్పుడు ఆయన ఉన్న ఇల్లు కొట్టుకుపోయింది' అని ఓ వ్యక్తి వాపోయారు.

**సహాయ శిబిరంపైనా కొండచరియలు**

వెల్లరిమల్లలో సహాయ శిబిరం ఏర్పాటు చేసిన ప్రభుత్వ పాఠశాలపైనా కొండచరియలు విరిగి పడ్డాయి. లోపల చిక్కుకున్న వారు తమను కాపాడమని ఫోన్లు చేసి వేడుకుంటున్నారని, వాయిస్ క్లిప్స్ వస్తున్నాయని ఈ పాఠశాల టీచర్ ఒకరు చెప్పారు.

### అరేబియా వేడెక్కడం వల్లే..

వయనాడ్ విలయానికి ప్రకృతి ప్రకోపమే కారణమని వాతావరణ శాస్త్రవేత్తలు చెప్తున్నారు. కేరళలో స్వల్ప వ్యవధిలో దట్టమైన మేఘాలు ఏర్పడటం, అతిభారీ వర్షాలు కురవడానికి అరేబియా సముద్రం, ముఖ్యంగా ఆగ్నేయ అరేబియా వేడెక్కడం ప్రధాన కారణమని అభిప్రాయపడుతున్నారు. వర్షాలతో నేల మొత్తం తడిగా మారిందని, ఇదే సమయంలో దట్టమైన మేఘాలు ఏర్పడి భారీ వర్షాలు కురవడంతో కొండచరియలు విరిగిపడ్డట్టు వాతావరణ శాస్త్రవేత్త అభిలాష్ తెలిపారు.

**రంగంలోకి ఆర్మీ, నేవీ, ఎన్డీఆర్ఎఫ్**

ప్రభావిత ప్రాంతాల్లో మంగళవారం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బందితో పాటు ఆర్మీ, నేవీ సిబ్బంది కూడా సహాయక చర్యలు ప్రారంభించారు. అయితే, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా హెలికాప్టర్లతో సహాయక చర్యలు చేపట్టలేకపోతున్నారు.

**ఆగిపోయిన సహాయక చర్యలు**

మంగళవారం సాయంత్రం 5 గంటల సమయానికే ఈ ప్రాంతంలో చీకటి నెలకొన్నది. విద్యుత్తు సరఫరా కూడా లేకపోవడం వల్ల మంగళవారం సాయంత్రం సహాయక చర్యలు చాలావరకు నిలిచిపోయాయి. అయితే, కొండ చరియలు విరిగిపడే ముప్పు ఇప్పటికీ కొనసాగుతున్నా సిబ్బంది ధైర్యంగా ప్రజల ప్రాణాలను కాపాడేందుకు శ్రమిస్తున్నారు.

### 48 గంటల్లో 572 మి.మీ. వర్షపాతం

వయనాడ్ ప్రాంతంలో సోమవారం నుంచి భారీగా వర్షాలు కురుస్తున్నాయి. పశ్చిమ కనుమల్లో గత 48 గంటల్లో 572 ఎంఎం వర్షపాతం నమోదయ్యింది. దీంతో వాగులు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చలియార్ నది ఉగ్రరూపం దాల్చింది. ఇరువఝింజిపుజ నది రెండుగా చీలిపోయి ప్రవహిస్తున్నది. దీంతో అనేక గ్రామాలు వరద ముంపునకు గురవుతున్నాయి. బుధవారం కూడా వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

### 2018 లాగా మళ్లీ చేతులు కలుపుదాం: విజయన్

కేరళ చూసిన తీవ్రమైన ప్రకృతి విపత్తుల్లో ఇది ఒకటని ముఖ్యమంత్రి పినరయి విజయన్ పేర్కొన్నారు. వయనాడ్ విలయంలో ధ్వంసమైన ప్రజల జీవితాలు, జీవనోపాధిని పునర్నిర్మించేందుకు కలిసిరావాలని ఆయన ప్రజలను కోరారు. 2018 నాటి వరదల నుంచి రాష్ట్రాన్ని పునర్నిర్మించుకున్నట్టుగానే ఇప్పుడు కూడా చేతులు కలపాలని ఆయన పిలుపునిచ్చారు. సీఎం డిస్ట్రెస్ రిలీఫ్ ఫండ్‌కు సాయం అందించాలని కోరారు. వయనాడ్ జిల్లాలో 45 సహాయక శిబిరాలను ఏర్పాటు చేశామని, 3,000 మందిని తరలించినట్టు ఆయన చెప్పారు.

### ప్రధాని ఆరా.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన

వయనాడ్ ఘటనపై ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా విచారం వ్యక్తం చేశారు. కేరళ సీఎం విజయన్‌కు ఫోన్ చేసి ఘటనపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడ్డ వారికి రూ.50,000 ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నట్టు ప్రధాని ప్రకటించారు.

## శిథిలాల కింద నుంచి బాధితుల ఫోన్‌కాల్స్

### తమను రక్షించాలని ఆత్మీయులకు వేడుకోలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): వయనాడ్‌పై ప్రకృతి ప్రకోపం అక్కడి స్థానికులకు చావు, బతుకులను ఒక్కటిగా చేసింది. మంగళవారం తెల్లవారుజామున విరిగిపడ్డ కొండచరియలు , బురద ధాటికి పదుల సంఖ్యలో ప్రజలు శిథిలాల్లో చిక్కుకుపోయారు. బురద ప్రవాహం ఇండ్లమీదకు దూసుకురావడంతో ఆ మట్టిలోనే కూరుకుపోయారు. దీంతో తాము ఎక్కడ ఉన్నామో తెలియని పరిస్థితి వారిది. చేతుల్లో, జేబుల్లో ఫోన్లు ఉన్న కొందరు తమ ఆత్మీయులకు ఫోన్లు చేసి ప్రాణాలు కాపాడాలని విలపించిన ఘటనలు అందరిని కలిచి వేస్తున్నాయి. శిథిలాల్లో చిక్కుకుపోయిన కొందరు ఇంటర్నెట్‌లో కంట్రోల్ రూమ్ నంబర్లను వెదికి.. తమను కాపాడాలంటూ కాల్స్, మెసేజీలు చేసినట్టు అధికారి ఒకరు పేర్కొన్నారు.



మెప్పాడి ప్రాంతం వద్ద స్థానికులను రక్షిస్తున్న ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది

**భూమి కంపించినట్టు..**

చూరల్మల ప్రాంతంలోని ఓ మహిళ తమ ఆత్మీయులకు ఫోన్ చేసి.. తాను బురదలోపల కూరుకుపోయానని.. వచ్చి వెంటనే తనను కాపాడాలంటూ ఫోన్‌లో అర్థిస్తూ చేసిన రోదన సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కొండ చరియలు విరిగి పడే సమయంలో భూమి కంపించినట్టు అయ్యిందని, దీంతో తాము ఎక్కడికి వెళ్లాలో అర్థం కాలేదని.. చూరల్మల, ముండకైకు చెందిన పలువురు వాపోయారు.

## 600 మంది కూలీలు ఎక్కడ?

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): పొట్ట కూటి కోసం పశ్చిమ బెంగాల్, అస్సాం నుంచి వయనాడ్‌కు ఏటా వందలాది మంది వలస కూలీలు పనుల కోసం వస్తుంటారు. ఇక్కడి తేయాకు, కాఫీ, యాలకుల తోటల్లో పని చేసి.. ఆ వచ్చే కొద్ది డబ్బును సొంత గ్రామాలకు పంపిస్తారు. అలా ఇక్కడి హారిసన్ మలయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్‌లో పనిచేయడానికి దాదాపు 600 మంది వలస కూలీలు, వారి కుటుంబ సభ్యులు కొన్ని రోజుల క్రితం వచ్చారు. వీరంతా ముండకైలోని నాలుగు వీధుల్లో నివాసం ఏర్పాటు చేసుకొన్నారు. ఇది కొండల మధ్య ఉండే ప్రాంతం. అయితే, మంగళవారం వేకువజామున విరుచుకుపడిన కొండ చరియలతో ఈ 600 మంది కూలీల ఆచూకీ గల్లంతైనట్టు అధికారులు తెలిపారు. కూలీలు నివాసం ఉంటున్న ఇండ్లన్నీ ధ్వంసమైనట్టు చెబుతున్నారు.

**తీవ్ర ఆందోళనగా ఉన్నాం**

ఘటనపై హారిసన్ మలయాళీ ప్లాంటేషన్ లిమిటెడ్ కంపెనీ జనరల్ మేనేజర్ బెనిల్ జాన్ స్పందించారు. గల్లంతైన వారిలో కేవలం ఐదుగురి మృతదేహాలను మాత్రమే గుర్తించినట్టు తెలిపారు. స్థానికంగా మొబైల్ ఫోన్ నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో కార్మికులను సంప్రదించే వీలులేకుండా పోయిందని వాపోయారు. 'మా కార్మికులతో ఇప్పటి వరకు సంప్రదించలేకపోయాం. దీనికి తోడు మొబైల్ ఫోన్ నెట్‌వర్క్‌లు కూడా పనిచేయడంలేదు' అని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.



మరణించినవారి మృతదేహాల వద్ద విషణ్ణ వదనాలతో వారి బంధువులు

## శవాల దిబ్బగా చలియార్ నది

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): వయనాడ్ విలయం ఓ నదిని శవాల దిబ్బగా మార్చేసింది. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 26 మృతదేహాలు కొట్టుకొచ్చిన దృశ్యాలు చూపరులను కంటతడి పెట్టించాయి. మల్లప్పురంలోని చలియార్ నదిలో 26 మృతదేహాలు తేలియాడుతూ కనిపించినట్టు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. చాలా వాటికి శరీర భాగాలు లేవు అని తెలిపారు. కొన్ని మృతదేహాలకు మొండేలు మాత్రమే ఉన్నాయని, మరికొన్నింటికి చేతులు, కాళ్లు లేవని వెల్లడించారు. ఈ రకంగా కొట్టుకొచ్చిన మూడేండ్ల పాప మృతదేహం ఒకటి స్థానికులను కలచివేసింది. బాధితులను రక్షించడానికి, మృతదేహాలను ఒడ్డున చేర్చడానికి గజ ఈతగాళ్లను, రెండు ఐఏఎఫ్ హెలికాప్టర్లను రంగంలోకి దించారు.



**ఊహకు అందనంత భయానకం**

చలియార్ నదిలో మృతదేహాలు కొట్టుకొచ్చిన వార్త నిజమేనని ఎమ్మెల్యే ఐసీ బాలకృష్ణన్ ధ్రువీకరించారు. ఎమ్మెల్యే టి సిద్ధిఖీ మాట్లాడుతూ.. ముండకై గ్రామంలో పరిస్థితి ఊహించిన దానికంటే ఇంకా ఎంతో భయానకంగా ఉన్నదని పేర్కొన్నారు.



### సహాయక చర్యలకు తెలుగు ఐఏఎస్ అధికారి నేతృత్వం

వయనాడ్‌లో ప్రభుత్వం చేపట్టిన సహాయక చర్యల్లో 2012 బ్యాచ్‌కు చెందిన తెలుగు ఐఏఎస్ అధికారి సీరం సాంబశివరావు కీలకంగా వ్యవహరిస్తున్నారు. స్థానిక సంస్థలకు ప్రిన్సిపల్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను ప్రభుత్వం వయనాడ్ సహాయక చర్యలకు ప్రత్యేక అధికారిగా నియమించింది. ఇంతకుముందు ఆయన కేరళ ఆగ్రో బిజినెస్ లిమిటెడ్ డైరెక్టర్‌గా, కోజికోడ్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తించారు. కొవిడ్ సమయంలో ఆయన పనితీరుకు ప్రశంసలు దక్కాయి. వయనాడ్ సహాయక బాధ్యతలను ప్రభుత్వం ఆయనకు అప్పగించింది.

## బండరాయి.. కొండంత ఆధారమై!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): నిశిరాతిరిలో విరుచుకుపడ్డ కొండచరియల ధాటికి ముండకై గ్రామమంతా బురదమయమైంది. బురదతో కూడిన ఈ వరద ప్రవాహంలో పదుల మంది కొట్టుకుపోయారు. అలా కొట్టుకుపోయిన ఓ వ్యక్తి కొంతదూరం తర్వాత బండరాళ్ల మధ్య అనూహ్య స్థితిలో ఇరుక్కుపోయాడు. ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పాటు బురదలో ఇరుక్కుపోవడంతో అక్కడి నుంచి బయటపడలేకపోయాడు. కనీసం నిలబడలేని పరిస్థితుల్లో తెల్లారేవరకూ బండరాయిని పట్టుకుని అలాగే ఉండిపోయాడు.

**కాపాడాలనుకొని ప్రయత్నించినా..**

ఉదయమే ఆ వ్యక్తిని గమనించిన కొందరు స్థానికులు అతన్ని కాపాడే ప్రయత్నాలు చేశారు. అయితే, బురదతో కూడిన వరద ప్రవాహం పెరుగడం, రాళ్లు అడ్డురావడంతో అది కుదరలేదు. అతన్ని కాపాడటం దాదాపుగా అసాధ్యమనే అందరూ అనుకొన్నారు.



కాపాడాలంటూ అతను చేసిన సంజ్ఞలు అక్కడి వారిని నిలకడగా ఉండనీయలేదు. దీంతో కొందరు ఆ దృశ్యాలను ఫోన్‌లో రికార్డ్ చేసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఆ వీడియోలు వైరల్ కావడంతో విషయం పై అధికారులకు తెలిసింది. దీంతో ఆ ప్రాంతానికి రెస్క్యూ బృందాలను పంపించిన ప్రభుత్వం.. అతన్ని క్షేమంగా బయటకు తీసుకొచ్చింది.

## జార్ఖండ్‌లో రైలు ప్రమాదం

- పట్టాలు తప్పిన హౌరా-ముంబై ఎక్స్‌ప్రెస్
- ఇద్దరు మృతి, 20 మందికి పైగా గాయాలు
- వరుస రైలు ప్రమాదాలపై విపక్షాల ధ్వజం



రాంచీ, జూలై 30: జార్ఖండ్‌లో రైలు ప్రమాదం చోటుచేసుకొన్నది. హౌరా-ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాలు తప్పడంతో 18 బోగీలు చెల్లాచెదురుగా పడ్డాయి. ఈ దుర్ఘటనలో ఇద్దరు మరణించగా, 20 మందికి పైగా గాయాలయ్యాయి. జంషెడ్‌పూర్‌కు 80 కిలోమీటర్ల దూరంలోని బారాబంబూ సమీపంలో మంగళవారం వేకువజామున 3.45 గంటలకు ఈ ప్రమాదం చోటుచేసుకొన్నది. ప్రమాదం జరిగిన తీరుపై అస్పష్టత నెలకొన్నది. అప్పటికే ఓ గూడ్స్ రైలు పట్టాలు తప్పిందని, దాని వ్యాగన్లు పక్కన ఉన్న ట్రాక్‌పై పడటంతో.. ఎదురుగా వస్తున్న హౌరా-ముంబై ఇంజిన్ వాటిని ఢీకొట్టిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఓ రైల్వే అధికారి మాట్లాడుతూ మెయిల్ రైలు ప్రమాదం జరిగిన ఘటనాస్థలికి సమీపంలోనే మరో గూడ్స్ రైలు కూడా పట్టాలు తప్పిందని, అయితే రెండు ప్రమాదాలు ఒకసారి జరిగాయా? అనేదానిపై స్పష్టత లేదని పేర్కొన్నారు.

**రీల్స్ మాని.. పనిపై దృష్టి పెట్టాలి!**

వరుసగా రైలు ప్రమాదాలు చోటుకుంటుండటంపై విపక్షాలు మండిపడ్డాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రీల్స్ చేయడం మాని, తన పనిపై దృష్టి పెట్టాలని హితవు పలికాయి.

**ఇటీవల చోటుచేసుకున్న రైలు ప్రమాదాలు**

| ఎప్పుడు? | ప్రమాదం ఎలా? | మృతులు |
|---|---|---|
| 2024, మే 28 | హౌరాలో పట్టాలు తప్పిన స్థానిక ఖాళీ రైలు | – |
| 2024, జూన్ 3 | పంజాబ్‌లోని సిర్‌హింద్ రైల్వే స్టేషన్‌లో ఢీకొన్న రెండు గూడ్స్ రైళ్లు | – |
| 2024, జూన్ 17 | పశ్చిమబెంగాల్‌లో కాంచన్‌జంగ ఎక్స్‌ప్రెస్‌ను ఢీకొన్న గూడ్స్ | 15 |
| 2024, జూలై 18 | పట్టాలు తప్పిన చండీగఢ్-దిబ్రూగఢ్ ఎక్స్‌ప్రెస్ | 4 |
| 2024, జూలై 26 | భువనేశ్వర్ స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్ | – |
| 2024, జూలై 26 | ఛత్తీస్‌గఢ్‌లో పట్టాలు తప్పిన ఖాళీ ప్యాసెంజర్ రైలు ఇంజిన్ | – |
| 2024, జూలై 27 | ముంబై సమీపంలో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు | – |
| 2024, జూలై 29 | ఒడిశాలోని శంబల్‌పూర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ | – |
| 2024, జూలై 29 | బీహార్‌లో విడిపోయిన సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ బోగీలు | – |

### గతంలో చోటుచేసుకున్న కొండచరియల విపత్తులు

**1.కేదార్‌నాథ్, ఉత్తరాఖండ్(2013)**

- 2013 జూన్‌లో కుంభవృష్టి కారణంగా ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్‌లో వరదలు పోటెత్తాయి. పెద్దయెత్తున కొండ చరియలు విరిగిపడ్డాయి. దేశ చరిత్రలోనే అత్యంత ఘోరమైన ఈ విపత్తులో 5 వేల మందికి పైగా మరణించారు.

**2.మాలిన్, మహారాష్ట్ర(2014)**

- మహారాష్ట్రలోని మాలిన్ గ్రామంలో 2014లో కొండచరియలు విరిగిపడి 151 మంది మరణించారు.

**3.షిల్లాంగ్, మేఘాలయ(2011)**

- మేఘాలయలోని షిల్లాంగ్‌లో కొండ చరియలు విరిగిపడిన ఘటనలో 20 మంది మరణించారు.

**4.కొట్టాయం, కేరళ(2019)**

- కేరళలోని కొట్టాయం జిల్లాలో కొండ చరియలు విరిగిపడ్డాయి. 15 మంది ప్రాణాలు కోల్పోయారు.

**5.మణిపూర్(2022)**

- భారీ వర్షాలతో మణిపూర్‌లో పలు చోట్ల కొండచరియలు విరిగిపడ్డ ఘటనల్లో 40 మంది మరణించారు.

## దేవభూమిపై ప్రకృతి ప్రకోపమెందుకు?

న్యూఢిల్లీ: కేరళపై ప్రకృతి పగ పట్టినట్టు కనిపిస్తున్నది. ప్రకృతి ప్రకోపంతో భారీ వర్షాలు, వరదలు, కొండ చరియలు విరిగిపడుతున్న ఘటనలతో రాష్ట్రం ప్రతి ఏటా విలవిలలాడుతున్నది. కేరళలో ప్రతి ఏడాదీ ఈ తీరు సర్వ సాధారణంగా కనిపిస్తున్నది. వరదలు, కొండ చరియలు విరిగిపడటం వంటి వర్ష సంబంధిత ఘటనల్లో పదుల సంఖ్యలో మరణిస్తున్నారు. 2018లో సంభవించిన విధ్వంసక వరదల్లో చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా 483 మంది మరణించారు. కేరళపై ప్రకృతి విపత్తులకు నిపుణులు పలు కారణాలను వెల్లడిస్తున్నారు. కేరళలో భారీ వర్షాలు, వరదలు సంభవించే అవకాశం ఉన్నదని, రాష్ట్రంలోని 14.5% భూభాగం అందుకు దుర్బలంగా ఉన్నట్టు అంచనా. పర్యావరణ మార్పులు, అటవీ నిర్మూలన వంటివి వర్షాకాలంలో కొండ చరియలు విరిగిపడుతున్న ఘటనలకు ప్రధాన కారణాలని నిపుణులు అంటున్నారు. ప్రభావిత ప్రాంతాల్లో నిర్మాణ రంగ కార్యకలాపాలూ విపత్తులకు కారణమని విశ్లేషిస్తున్నారు.

**కేరళలోనే అధిక ఘటనలు**

దేశంలో కేరళలోనే అధిక సంఖ్యలో కొండ చరియలు విరిగిపడే ఘటనలు చోటుచేసుకొంటున్నాయని కేంద్ర ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖ గతంలో పార్లమెంట్‌లో వెల్లడించింది. 2015-22 మధ్య 3,782 ఘటనలు చోటు చేసుకోగా, వాటిల్లో 2,239(59.2%) ఒక్క కేరళలోనే జరిగాయని తెలిపింది. మొత్తం 1,848 చదరపు కిలోమీటర్లు(రాష్ట్రం విస్తీర్ణంలో 4.75%) 'హై ల్యాండ్‌స్లైడ్ హజార్డ్ జోన్'గా కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ గుర్తించింది. కొద్ది రోజుల వ్యవధిలోనే అధిక వర్షపాతం నమోదు గమనించాల్సిన అంశమని కేరళ ఫారెస్ట్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ శాస్త్రవేత్త రాజీవ్ పేర్కొన్నారు.